జెండా పండగకు వేళాయె..

పాఠశాలలు, కార్యాలయాలు త్రివర్ణ శోభితం



విద్యుత్ దీపాల వెలుగుల్లో పెదగంట్యాడ తహసీల్దార్ కార్యాలయం



త్రిష్నా మైదానంలో ముస్తాబైన వేదిక

పెదగంట్యాడ: భారతావని స్వేచ్ఛావాయువులు పీల్చుకున్న ఆనందక్షణం.. దశాబ్దాలు గడిచినా ప్రతీ భారతీయుడి మదిలో పదిలం. ఆ జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ, 76 ఏళ్ల ప్రస్థానంలో మన దేశ విజయపరంపరను తలచుకుంటూ .. మది నిండుగా మువ్వన్నెల జెండాకు వందనం చేసేందుకు.. స్వాతంత్య్ర సమరవీరులకు సెల్యూట్ చేసేందుకు నియోజకవర్గంలోని పాఠశాలలు, కార్యాలయాలు ముస్తాబవుతున్నాయి. దీంతో అంతటా జెండా పండగ సందడి నెలకొంది. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, వ్యాపార, వాణిజ్య కేంద్రాలు, కార్మిక సంఘాలు, అసోసియేషన్లు, ఆటో స్టాండ్‌లలో జెండా ఎగరవేసేందుకు అవసరమైన సరంజామాను సిద్ధం చేశారు. పెదగంట్యాడ తహసీల్దార్ కార్యాలయాన్ని మూడు రంగుల జెండాను తలపించే విధంగా మువ్వన్నెల విద్యుత్ దీపాలతో అలంకరించారు. జెండా ఎగరవేసే స్తంభానికి మూడు రంగులను వేసి సిద్ధం చేశారు. పాఠశాల ఆవరణలు, తరగతి గదులు, త్రివర్ణ శోభితమయ్యాయి. విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఉక్కు నగరం త్రిష్నా గ్రౌండ్, బీహెచ్ఈఎల్‌లో పరేడ్‌కు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

త్రిష్నా మైదానంలో..

ఉక్కునగరం: స్వాతంత్య్ర దినోత్సవానికి స్టీల్‌ప్లాంట్ త్రిష్నా మైదానం ముస్తాబైంది. స్టీల్‌ప్లాంట్ టౌన్ అడ్మినిస్ట్రేషన్ విభాగం సివిల్ మెయింటెనెన్స్ ఏజీఎం మంత్రి నర్సింహమూర్తి ఆధ్వర్యంలో మైదానంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మైదానం మొత్తం జాతీయ జెండాలు, పూల మొక్కలతో అందంగా అలంకరించారు. ఉదయం 9 గంటలకు ప్రారంభం కానున్న ఈ వేడుకలకు స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ ముఖ్య అతిథిగా హాజరై సీఐఎస్ఎఫ్ కమాండెంట్ నేతృత్వంలో సిబ్బంది అందించే గౌరవ వందనం స్వీకరిస్తారు. వివిధ పాఠశాలల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించనున్నారు.

భెల్‌లో..

అక్కిరెడ్డిపాలెం: జెండా పండగకు భెల్ (హెచ్‌పీవీపీ) మైదానం ముస్తాబైంది. సంస్థ జీఎం ఇన్‌చార్జి ఎస్.జితేందర్ రెడ్డి, సీనియర్ కార్మికుడు జి.టి.పి.ప్రకాష్ త్రివర్ణ పతాకాన్ని ఎగరవేయనున్నారు. ఆటోనగర్ వాసీవాలో అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్, ఐలాలో ఇన్‌చార్జి చైర్మన్ కొల్లి ఈశ్వరరావు జెండా ఎగరవేయనున్నారు.

దువ్వాడ వీఎస్ఈజెడ్‌లో జెండాల పంపిణీ



మువ్వన్నెల జెండాలను పంపిణీ చేస్తున్న దువ్వాడ వీఎస్ఈజెడ్ జోనల్ డీసీ శ్రీనివాస్

అగనంపూడి: హర్ ఘర్ తిరంగా కార్యక్రమం విజయవంతం చేయాలని దువ్వాడ వీఎస్ఈజెడ్ జోనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ ముప్పాళ శ్రీనివాస్ కోరారు. దువ్వాడ వీఎస్ఈజెడ్ పరిపాలనా భవనంలో అధికారులు, సిబ్బందితో పాటు వివిధ యూనిట్లకు సోమవారం త్రివర్ణ పతాకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జాయింట్ డెవలప్‌మెంట్ కమిషనర్ రోషిని అపరంజి కొరాతి, ఐఆర్ఎస్ ప్రసాద్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



విజేతలతో జిమ్ కోచ్‌లు గురుమూర్తి, అప్పలస్వామి

పెదగంట్యాడ: ఏపీ స్టేట్ పవర్ లిఫ్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 5వ ఏపీ స్టేట్ బెంచ్ ప్రెస్ చాంపియన్‌షిప్ 2023 సెకండ్ ఏపీ స్టేట్ డెడ్ లిఫ్ట్ చాంపియన్‌షిప్ పోటీల్లో పలువురు సత్తా చాటి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీల్లో స్వామి ఫిట్‌నెస్ జిమ్‌కు చెందిన జి.తాతారావు, ఎంపీఎస్ రెడ్డి ప్రథమ స్థానం కైవసం చేసుకోగా.. వై.నూకరాజు ద్వితీయ స్థానంలో నిలిచారు. కూన ప్రభాకర్ రావు, పి.వినయ్ కుమార్ బ్రాంజ్ మెడల్స్ సాధించారు. విజేతలను జిమ్ కోచ్‌లు గురుమూర్తి, అప్పలస్వామి అభినందించారు.

ఉమారామలింగేశ్వరాలయంలో మాస శివరాత్రి పూజలు



పూజలు అందుకుంటున్న రామలింగేశ్వరుడు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు ఉమా రామలింగేశ్వర ఆలయంలో సోమవారం మాస శివరాత్రి పూజలు నిర్వహించారు. ఆలయంలో వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల సహకారంతో అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు భద్రు నాయక్, ఎల్లేటి శ్రీనివాసరావు, సురేంద్ర, కనకరెడ్డి, లలితారావు తదితరులు పాల్గొన్నారు.

ధ్వజ స్తంభానికి ఇత్తడి తొడుగు



ఇత్తడి తొడుగులతో తయారీదారుడు రామలింగేశ్వర కుమార్

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్‌టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ ఆలయం ఎదురుగా 32 అడుగుల ధ్వజస్తంభానికి ఇత్తడి తొడుగులను అమర్చారు. తెనాలికి చెందిన దేవతా మూర్తుల విగ్రహాల తయారీదారుడు అక్కల రామలింగేశ్వర కుమార్ తయారు చేసిన ఈ తొడుగులను సోమవారం ధ్వజస్తంభానికి అలంకరించడంతో కొత్త కళను సంతరించుకుంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



తోట శ్రీనివాస్ వరప్రసాద్ (ఫైల్)

కూర్మన్నపాలెం: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తి ఆయిల్ ట్యాంకర్ వెనుక చక్రాల కిందపడి మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు.. వడ్లపూడి పరిధి ఈసీఎస్ గార్డెన్స్ గణేష్‌నగర్‌కు చెందిన తోట శ్రీనివాస్‌వరప్రసాద్(70) ట్రాన్స్‌పోర్ట్ ఆఫీస్ నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సోమవారం ఉదయం ట్రాన్స్‌పోర్ట్ ఆఫీస్‌కు తన ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో కూర్మన్నపాలెం జంక్షన్ వద్ద వచ్చేసరికి గాజువాక నుంచి అనకాపల్లి వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్ పక్క నుంచి వెళ్లడంతో శ్రీనివాస్‌వరప్రసాద్ నడుపుతున్న ద్విచక్రవాహనానికి తగలడంతో జారిపడి ఆయిల్ ట్యాంకర్ వెనుక చక్రాల కింద పడిపోయారు. దీంతో తలకు తీవ్ర గాయమై అధిక రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దువ్వాడ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. భార్య వెంటకలక్ష్మి కుమారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం జగన్ పాలనలో రాష్ట్రం సుభిక్షం



లబ్ధిదారులకు సంక్షేమపథకాల బ్రోచర్ ఎమ్మెల్యే నాగిరెడ్డి

కూర్మన్నపాలెం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. పేదలందరూ సంతోషంగా ఉన్నారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 86వ వార్డు పరిధి ఫకీర్‌తక్యా, ఎస్సీ కాలనీ సచివాలయం-1 పరిధిలో ఎమ్మెల్యే సోమవారం పర్యటించారు. వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి దామా సుబ్బారావుతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. గత ప్రభుత్వ పాలనలో పేదలు అనేక కష్టాలు అనుభవించారన్నారు. ఏ సంక్షేమ పథకాలనైనా ప్రజాప్రతినిధులే గద్దలా తన్నుకుపోతూ పేదవారికి ఆకలిని మిగిల్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కానీ ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక కుల,మత, వర్గ, విభేదాలకు తావు లేకుండా రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు నేరుగా అందిస్తుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇస్తున్న సీఎం జగన్ నాడు-నేడు, మహిళాసాధికారకత, విద్య-వైద్యం, పేదలకు పక్కా ఇళ్లు, ప్రజల వద్దకే ప్రభుత్వ పథకాలు వంటి అంశాలతో ముందుకు సాగుతున్నారన్నారు. ఆయనకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, మండల కన్వీనర్ వాడపల్లి రామచంద్రరాజు, వార్డు అధ్యక్షులు వెలుగుల పరశురాముడు, చేగొండి శ్రీనివాసరావు, సోషల్ మీడియా కన్వీనర్ శ్రీనివాస్ పట్నాయక్, మాటూరి శ్రీనివాసరావు, బాలకృష్ణ, వార్డు మహిళా అధ్యక్షురాలు నిర్మల, వరలక్ష్మి, శ్రీను, పట్నాల రాజు, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీ వైద్యాధికారికి అభినందనలు



డాక్టర్ హేమలతకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గ్రామస్తులు

పెదగంట్యాడ: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన డాక్టర్ హేమలతను నెల్లిముక్కు గ్రామస్తులు సోమ వారం మర్యాదపూర్వకంగా కలిశారు. పు ష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కొరిబిల్లి గోవింద్, పూడి హరిష్, పూడి రవి, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన



శిబిరంలో పాల్గొన్న ఐలా, వాసీవా, లఘు ఉద్యోగ భారతి ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: రక్తదానం ప్రాణదానంతో సమానమని వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్ అన్నారు. సోమవారం ఆటోనగర్‌లోని ఐలా భవనంలో ఆటోనగర్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రియలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వాసీవా), ఏపీఐఐసీ-ఇండస్ట్రియల్ ఏరియాస్ లోకల్ అథారిటీస్, లఘు ఉద్యోగ భారతి సంయుక్తంగా రోటరీ బ్లడ్ సెంటర్, లయన్స్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు పారిశ్రామిక వేత్తలు, కార్మికులు, ఉద్యోగులు ఈ శిబిరంలో పాల్గొన్నారు. వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్ రక్తదానం చేశారు. ఆయన ఇప్పటి వరకు 40 సార్లు రక్తదానం చేసినట్లు పేర్కొన్నారు. ఆరోగ్యవంతులందరూ అపోహలు వీడి, రక్తదానం చేయాలని కోరారు. శిబిరంలో 100 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ డీజెడ్ఎం, ఐలా కమిషనర్ కె.సూర్యనారాయణ, ఇన్‌చార్జి చైర్మన్ కొల్లి ఈశ్వరరావు, కార్యదర్శి చీకటి సత్యనారాయణ, ఐలా డీ ఎక్స్‌పెన్షన్ మెంబర్ అశోక్ రాజు, లఘు ఉద్యోగ భారతి రాష్ట్ర అధ్యక్షుడు ఎ.కె.బాలాజీ, జిల్లా అధ్యక్షుడు అట్లూరి రమేష్, వాసీవా కార్యదర్శి రాంప్రసాద్, ప్రతినిధి అనార్‌బాబు, లయన్స్ బ్లడ్ బ్యాంక్, రోటరీ బ్లడ్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉరి వేసుకుని భెల్ కార్మికుడి మృతి



నర్సింగరావు (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: బీహెచ్ఈఎల్ కార్మికుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఘటనకు సంబంధించి గాజువాక ఎస్ఐ ఎం.రవికుమార్, మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బీహెచ్ఈఎల్ హెచ్‌సీ విభాగంలో వెల్డర్‌గా పని చేస్తున్న మదుతూరు నర్సింగరావు (53) భార్య జయంతి, ఇద్దరు పిల్లలతో భెల్ టౌన్‌షిప్ క్వార్టర్ ఎస్-41లో నివసిస్తున్నారు. కుమార్తె మాధవీలత ఇంజినీరింగ్ పూర్తి చేసి ప్రైవేట్ జాబ్ చేస్తుండగా, కుమారుడు ఆదర్శ్ బీటెక్ పూర్తి చేశాడు. నర్సింగరావు కొద్దికాలంగా మద్యానికి బానిసై విధులకు గైర్హాజరు అవుతున్నాడు. సోమవారం మధ్యాహ్నం భార్య, కుమార్తెతో బాగానే ఉన్నాడు. కుమారుడు ఆదర్శ్ కంటి పరీక్షల నిమిత్తం బయటికి వెళ్లాడు. ఆ సమయంలో నర్సింగరావు హఠాత్తుగా ఇంటికి ఆనుకొని ఉన్న షెడ్డులోకి వెళ్లి షెడ్డు హుక్కుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొంతసేపటికి హుక్కుకు వేలాడుతున్న నర్సింగరావును చూసిన అతని భార్య, కుమార్తె ఊహించని పరిణామంతో ఆందోళనకు గురయ్యారు. స్థానికుల సాయంతో నర్సింగరావును కిందకు దించి, స్థానికంగా ఉన్న భెల్ ఆస్పత్రికి తరలించారు. అతను మృతి చెందాడని వైద్యులు తెలపడంతో, పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సమాచారం అందుకున్న గాజువాక ఎస్ఐ ఎం.రవికుమార్ మృతుని నివాసానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వాహన కాలుష్యంపై ఆందోళన



గాజువాక జోనల్ కార్యాలయంవద్ద ఆందోళన నిర్వహిస్తున్న దృశ్యం

గాజువాక: పరిశ్రమలకు ముడిసరకును రవాణా చేస్తున్న భారీ వాహనాల ద్వారా ఉత్పన్నమవుతున్న కాలుష్యంపై బాధిత గ్రామాలకు చెందిన నివాసులు సోమవారం ఆందోళన నిర్వహించారు. పాతకర్ణవానిపాలెం నుంచి పోర్టు రోడ్ మీదుగా జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జోనల్ కార్యాలయం, గాజువాక తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఆందోళనలు నిర్వహించిన అనంతరం ఆయా కార్యాలయాల్లోని అధికారులకు వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్, గంగవరం ఆదానీ పోర్టు, ఇతర పరిశ్రమలకు ముడిసరుకును రవాణా చేస్తున్న భారీ వాహనాలు కనీస ప్రమాణాలను పాటించడం లేదని, దీనివల్ల పోర్టు రోడ్‌లోని గ్రామాలన్నీ తీవ్రమైన కాలుష్యానికి గురయ్యాయని పేర్కొన్నారు. వై జంక్షన్ నుంచి వాహనాలను స్టీల్‌ప్లాంట్ మీదుగా కూర్మన్నపాలెం వైపు మళ్లించాలని కోరారు. కార్యక్రమంలో బాధిత గ్రామాల ప్రతినిధులు ఎస్.వి.రమణ, మోహన్‌రావు, హనుమంతరావు, ప్రభాకర్, శ్రీనివాసరావు, సిరసపల్లి అప్పారావు, కరణం రామకృష్ణ, బీజేపీ నాయకులు శంకరరావు, నాగేశ్వరరావు, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు లయన్స్ క్లబ్ వితరణ



నిరుపేదలకు సరకులు అందిస్తున్న గోపాలరావు

అగనంపూడి: లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ డాక్టర్ ఎ.గోపాలరావు అగనంపూడిలో చేపట్టిన పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. డాన్ టూ డస్క్ (సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు) కార్యక్రమంలో భాగంగా అగనంపూడి లయన్స్‌క్లబ్‌ను సందర్శించారు. రెండు నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు, చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సమన్వయకర్త గుదే సుశీలా గజేంద్రరావు, ఉపగవర్నర్లు ప్రసాద్, సూర్యప్రకాష్, రీజనల్ చైర్ పర్సన్ సుధీర్, పి.కాళిదాస్, అగనంపూడి క్లబ్ చైర్మన్ ఎం.జగదీష్, కార్యదర్శి ఆడారి వెంకటకృష్ణ, కిడిమి హనుమంతురావు, బత్తుల కాళిదాస్ తదితరులు పాల్గొన్నారు.

‘డిపెండెంట్స్’కు వైద్య సదుపాయాలపై వినతి



స్టీల్‌ప్లాంట్ పర్సనల్ డైరెక్టర్ పాండేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులపై ఆధారపడిన కుటుంబ సభ్యుల (డిపెండెంట్స్)కు వైద్యం అందించే సమయంలో ఆస్పత్రి యాజమాన్యం సృష్టిస్తున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్టీల్ సీఐటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్) డాక్టర్ ఎస్.సి. పాండేను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. డిపెండెంట్ అని డిపార్ట్‌మెంట్ పర్సనల్ అధికారులు ధ్రువీకరించినా, ప్లాంట్ పర్సనల్ అధికారి ధ్రువీకరణ కావాలని వారు ఒత్తిడి తెస్తున్నారన్నారు. ప్లాంట్ పర్సనల్ అధికారి సంతకం పెట్టేందుకు నిరాకరిస్తున్నారన్నారు. జనరల్ ఆస్పత్రి నుంచి రిఫర్ చేసిన రోగుల నుంచి ఆయా కార్పొరేట్ ఆస్పత్రులు టెస్టుల పేరిట సొమ్ము వసూలు చేస్తున్నారన్నారు. ఆస్పత్రి సమస్యలపై తమ యూనియన్, పర్సనల్, ఆస్పత్రి అధికారులతో సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. డైరెక్టర్‌ను కలిసిన వారిలో యూనియన్ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్, అధ్యక్షుడు వై.టి.దాస్, ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి ఉన్నారు.

17 నుంచి సీపీఐ బస్సు యాత్ర



బస్సు యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న స్టాలిన్ తదితరులు

గాజువాక: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 17 నుంచి బస్సు యాత్రను నిర్వహించనున్నట్లు సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు ఎ.జె.స్టాలిన్ తెలిపారు. యాత్ర పోస్టర్‌ను గాజువాకలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఈ బస్సు యాత్రను కూర్మన్నపాలెం జంక్షన్‌లోని విశాఖ ఉక్కు కార్మికుల దీక్ష శిబిరం వద్ద ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్జీత్ కౌర్ ప్రారంభిస్తారని తెలిపారు. వచ్చేనెల 8వ తేదీ వరకు యాత్ర రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో యాత్ర కొనసాగుతుందని, తిరుపతిలో ముగింపు సభ ఉంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ, ఎల్లేటి శ్రీనివాసరావు, జి.ఆనంద్, కె.అచ్యుతరావు, ఉక్కు ఏఐటీయూసీ నాయకులు కె.ఎస్.ఎన్.రావు, చీకటి శ్రీనివాసరావు, పప్పు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ ఆపేవరకూ ఉద్యమిస్తాం



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిలిపివేస్తున్నట్లు కేంద్రప్రభుత్వం ప్రకటించేంత వరకు ఉక్కు ఉద్యమం ఆపేది లేదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు తెలిపారు. ఎన్నాళ్లయినా, ఎన్నేళ్లయినా ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 914వ రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరంలో ప్లాంట్‌లోని వివిధ విభాగాలకు చెందిన కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తే వచ్చే లాభాలను ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తూ కేంద్రప్రభుత్వం ఎందుకు సాధించలేదో తెలపాలని పేర్కొన్నారు. ప్రభుత్వం విధి ప్రైవేట్ వ్యక్తులతో కలిసి వ్యాపారం చేయడం కాదని, వాణిజ్యానికి ఊతమివ్వడమేనని అన్నారు. ప్రభుత్వరంగ సంస్థల మీద ఆధారపడి ఉన్న అనేక మంది కార్మికులు, శ్రామికులకు కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

జెడ్సీ దృష్టికి సిద్ధార్థనగర్ సమస్యలు



జెడ్సీకి వినతిపత్రం అందజేస్తున్న కాలనీ కమిటీ నాయకులు

గాజువాక: స్థానిక సిద్ధార్థనగర్‌లోని ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఆ కాలనీ మెయింటెనెన్స్ కమిటీ నాయకులు కోరారు. ఈ మేరకు కమిటీ నాయకులు జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలంను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీలో వీధి లైట్లు పని చేయడం లేదని, మురుగునీటి కాలువలు సరిగా లేవని, రోడ్లు పాడైపోయాయని పేర్కొన్నారు. తాగునీటి సరఫరాలో సమయపాలన ఉండటం లేదని వివరించారు. ఈ సమస్యలను పరిష్కరించాలని కోరారు. వినతి పత్రం సమర్పించినవారిలో నాయకులు బలిరెడ్డి నాగేశ్వరరావు, జె.ఎన్.మూర్తి, శంకర్ నాయక్ తదితరులున్నారు.